క్లుప్తంగా

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

షాద్‌నగర్: ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంపై గురువారం షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పార్థసారథి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరవుతున్నట్లు చెప్పారు. ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ అవగాహన సదస్సుకు రైతులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం


నూతన కమిటీ సభ్యులు

షాద్‌నగర్: స్థానిక బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలిచిన నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నర్వ వేణుగోపాల్‌రావు, ఉపాధ్యక్షుడిగా చీపిరి చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా నర్సింలు, లైబ్రేరియన్‌గా రమేశ్, కోశాధికారిగా లింగం, స్పోర్ట్స్ అండ్ కల్చరర్ సెక్రటరీగా రహీముద్దీన్, సభ్యులుగా శ్రీశైలం, విజయ్‌కుమార్, విజయ్‌భాస్కర్, శ్రీనివాస్, రూప్‌సింగ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పలువురు న్యాయవాదులు నూతన కార్యవర్గం సభ్యులను ఘనంగా సత్కరించారు.

వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని గణేశ్ దేవాలయంలో సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనికి మున్సిపల్ మాజీ చైర్మన్ హాజరయ్యారు. ఆధ్యాత్మిక చింతనను అవలంబించుకుంటే ప్రశాంతత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు యుగేందర్, నందకిషోర్, అంతయ్య, లింగంగౌడ్, అభిలాష్, గోపాల్, సాగర్, ప్రవీణ్, శ్రీధర్, శ్రీనివాస్, ఆలయ ట్రస్టు సభ్యులు శంకర్‌లాల్, గోవింద్, మహావీర్, భరత్, రాజేశ్, పూజారులు రాజన్ శాస్త్రీ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దాసోజుకు శుభాకాంక్షలు


శ్రవణ్‌కుమార్‌ను ఆలింగనం చేసుకుంటున్న నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: ఎమ్మెల్యేల కోటలో ఎమ్మెల్సీగా ఎన్నికైన దాసోజు శ్రవణ్‌కుమార్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య విద్యతో గుర్తింపు


మొదటి బ్యాచ్ విద్యార్థులతో మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: వైద్య విద్యతో విద్యార్థులు మంచి గుర్తింపు పొందాలని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆసుపత్రి, వైద్య కళాశాలలో 2019 మొదటి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం, ఫ్రీ కాన్వకేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వైద్యకళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, డీన్ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ జోయారాణి, మెడికల్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, నాయకులు మానిక్యరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసానికి అర్జీల వెల్లువ

- వెరిఫికేషన్‌కు సన్నాహాలు చేస్తున్న అధికారులు
- దరఖాస్తుదారుల్లో చిగురించిన ఆశలు

మొయినాబాద్: యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో 725 దరఖాస్తులు రాగా మండలంలో 625 అర్జీలు వచ్చాయి. ఈ నెల 14తో ఆన్‌లైన్‌లో అప్లికేషన్‌కు గడువు ముగిసింది. అంతలోపు దరఖాస్తు చేసుకున్నవారు మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో పత్రాలు అందజేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రామాల నుంచి ఈ పథకానికి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కో గ్రామం నుంచి సుమారు వందకు పైగా అర్జీలు అందాయి. మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీల నుంచి సైతం భారీగానే దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో గ్రామం నుంచి సుమారు 30 మందికి పైగా యువత స్వయం ఉపాధికోసం అర్జీ పెట్టుకున్నారు.


మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు అందజేస్తున్న యువకులు

స్వయం ఉపాధిపై ఆసక్తితో

స్వయం ఉపాధిపై ఆసక్తితో యువత రాజీవ్ యువ వికాసం పథకానికి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. పదేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధికోసం ప్రభుత్వం రుణాలు మంజూరు చేయలేదు. గతంలో ఓ సారి దరఖాస్తులు స్వీకరించినా మంజూరు మాత్రం కాలేదు. దీంతో చాలా కాలంగా యువత స్వయం ఉపాధికోసం ఎదురుచూస్తున్నారు. అందుకు అనుగుణంగా రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను ఆహ్వానించడంతో యువత పెద్ద సంఖ్యలో స్పందించారు.

ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు	
మొయినాబాద్ మున్సిపాలిటీ	725
మొయినాబాద్ మండలం	625
మొత్తం	1350

ఎంపిక బాధ్యత కమిటీలదే

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులను ఎంపిక చేయడానికి ప్రభుత్వం కమిటీలను వేసింది. అయితే అంతకు ముందే అధికారులు క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహిస్తారు. మండల, మున్సిపల్, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలు అర్హులను గుర్తించి ఎంపిక చేస్తాయి. ఆ నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపుతారు. అన్నింటినీ పరిశీలించిన తరువాత కలెక్టర్ తుది జాబితాను విడుదల చేస్తారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఎంపికైన వారికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న రుణ పత్రాలు అందజేసే అవకాశం ఉంది.

స్వయం ఉపాధి కోసం



స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవాలని చాలా రోజుల నుంచి చూస్తున్నాను. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ప్రభుత్వం రుణాలు ఇస్తామని ప్రకటించడంతో దరఖాస్తు చేసుకున్నాను. ప్రభుత్వం రుణం మంజూరు చేస్తే స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకుంటాను.

– గణేష్‌రెడ్డి, చందానగర్, మొయినాబాద్

అర్జీలు ఎక్కువ వచ్చాయి



రాజీవ్ యువ వికాసం పథకానికి మున్సిపాలిటీ పరిధిలో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. వెరిఫికేషన్ చేసే ప్రక్రియను త్వరలోనే మొదలు పెడతాం. కమిటీల ద్వారా అర్హులను ఎంపిక చేసే అవకాశం ఉంది. ఎంపికైనవారికి ప్రభుత్వం రుణం మంజూరు చేస్తుంది.

– ఖాజా మొయిజుద్దీన్, కమిషనర్, మొయినాబాద్

పైపు పగిలి.. రాకెట్‌లా ఎగిసి

మిషన్ భగీరథ పైపులైన్ లీకై నీరు పైకి ఎగిసి పడుతూ వృథాగా పోయింది. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని వికారాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిలోని చాయ్ బంక్‌కు సమీపంలో బుధవారం మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ లీకేజీతో ఒక్కసారిగా నీరంతా పైకి ఎగిసి పడింది. దీంతో రోడ్డంతా బురదమయంగా మారింది. వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. పక్కనే విద్యుత్ తీగలు సైతం ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురై అధికారులు సమాచారం ఇచ్చి నీటికి బంద్ చేయించారు. కాగా నీటి ప్రవాహ దృశ్యాలు రాకెట్ మాదిరి ప్రయాణికులను ఆకట్టుకున్నాయి.

– చేవెళ్ల


పైపులైన్ లీకేజీతో విరజిమ్ముతున్న నీరు

‘భూ భారతి’పై అవగాహన సమావేశం

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంపై గురువారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తారని తహసీల్దార్ అజాంఅలీ తెలిపారు. మండల పరిధిలోని రైతులు, ప్రజలు, నాయకులు స్వచ్ఛందంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

మొయినాబాద్: ప్రభుత్వ భూమిని కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు తోలుకట్ట గ్రామస్తులు విన్నవించారు. ఈ మేరకు వారు బుధవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని తోలుకట్ట రెవెన్యూలోని సర్వే నంబర్ 155లో 14 గుంటల భూమిని నగరానికి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేసి అందులో తన కుమారుడి సమాధి ఏర్పాటు చేశారని వివరించారు. దానికి శ్రీ పండిట్ రోహిత్ మహరాజ్ దేవస్థానం అని పేరుపెట్టి భారీ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కబ్జా చేసి వారిపై చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు శివశంకర్, వెంకటయ్య, యాదయ్య, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తోలుకట్ట గ్రామస్తులు

తాగునీటి సమస్య రానీయొద్దు

మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ సూచించారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం వార్డు కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సమస్యపై ఫిర్యాదు వస్తే 24 గంటల్లో సమస్య పరిష్కరించాలన్నారు. పైప్‌లైన్ల లీకేజీలు లేకుండా చూసుకోవాలని, బోరుమోటార్లు రిపేర్లు ఉన్నా వెంటనే చేయించాలన్నారు. అదే విధంగా పారిశుద్ధ్య నిర్వహణ, తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు జమీర్ అహ్మద్, వెంకటేష్, సుదర్శన్, వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

కాంగ్రెస్‌తోనే సమన్యాయం సాధ్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


గూడూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు: కాంగ్రెస్ పార్టీతోనే సమన్యాయం సాధ్యమవుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రాజ్యాంగంలో ఉన్న పలు చట్టాల సవరణను నిరసిస్తూ పార్టీ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని మక్తగూడ, గూడూరు, మల్లాపూర్ గ్రామాల్లో నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగానికి ప్రపంచంలోనే ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు. దేశంలో ఉన్న ప్రతి ఒక్కరికి కులాలు, మతాలతో సంబంధం లేకుండా అన్ని రంగాల్లో సమానంగా అవకాశాలు, రిజర్వేషన్లు ఉండాలని బాబాసాహెబ్ సూచించినట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం ఓట్ల కోసమే బీజేపీ ప్రభుత్వం చట్టాల సవరణ పేరుతో రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, దయానంద్‌గుప్తా, సాయిలు, బాలశౌరెడ్డి, రాందాస్‌నాయక్, శంకర్‌నాయక్, శ్రీరాములు, దర్శన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

అంతకుముందు మండలంలోని పెంజర్ల గ్రామంలో ఉన్న అనంత పద్మనాభస్వామి ఆలయ నూతన పాలకవర్గ కమిటీని ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా బెజవాడ అనితారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్వయంభూ అనంతపద్మనాభస్వామి ఆలయానికి గొప్ప చరిత్ర ఉందన్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు విశ్వం, శివశంకర్‌గౌడ్, చెన్నయ్య, రఘునాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహ ఆలయ అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని స్వయంభు శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి మురళీకృష్ణ, ఆలయ అర్చకుడు అరుణ్‌శర్మల సమక్షంలో స్వామివారి కల్యాణం ఆహ్వాన పత్రికను బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్యాణ వేడుకల భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, ముత్యాల రాజశేఖర్‌రావు, ఆకుల ఆనంద్, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మినీ గురుకుల పాఠశాల పరిశీలన

మంచాల: రంగాపూర్ మినీ ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలను ఎంపీడీఓ బాలశంకర్ బుధవారం తనిఖీ చేశారు. భోజనం, తాగు నీటి, పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. వసతిగృహం పరిసరాలు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మరో రెండు తరగతి గదులు మంజూరు అయ్యాయని, స్థల పరిశీలన చేసి నిర్మాణ పనులు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు నాయకులు కోటి రాథోడ్, మాధవరెడ్డి, మధుసూదనచారి, అజయ్‌బాస్, సుభాష్ తదితరులు ఉన్నారు.

కళాశాలలో సమస్యలు పరిష్కరించండి

ఇంటర్ బోర్డు కమిషనర్‌కు మొగిలిగిద్దవాసుల వినతి

షాద్‌నగర్: ప్రభుత్వ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బుధవారం మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామస్తులు ఇంటర్ బోర్డు కమిషనర్ శ్రీకృష్ణ ఆదిత్యను కోరారు. ఈ మేరకు స్థానికులు శ్యాంసుందర్, ర్యాకల మల్లేశ్, కళాశాల ప్రిన్సిపాల్ మంజుల తదితరులు ఇంటర్ బోర్డు కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. కమిషనర్ శ్రీకృష్ణ ఆదిత్య, ఆర్‌జేడీ జయప్రద బాయిలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. 25 ఏళ్లుగా గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కొనసాగుతుందని, ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకుందని పేర్కొన్నారు. కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందని, వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కమిషనర్‌ను గ్రామస్తులు సత్కరించిన జ్ఞాపికను అందజేశారు.


ఇంటర్ బోర్డు కమిషనర్‌ను కలిసిన గ్రామస్తులు

చిరు ధాన్యాలతోనే ఆరోగ్యం పదిలం

ఐసీడీఎస్ సీడీపీఓ షభానా

నందిగామ: చిరుధాన్యాలలోనే పోషకాలు అధికంగా ఉంటాయని, వాటిని బాలింతలు, గర్భిణులు తప్పకుండా ఆహారంగా తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ షభానా సూచించారు. మండల కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో బుధవారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ షభానా మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిరుధాన్యాలు, వాటి ప్రాముఖ్యత, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభిస్తాయని అన్నారు. చిన్నారులకు 6 నెలల వరకు తల్లి పాలు ఇవ్వాలని, అవే అమృతంలాగా పనిచేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమతి, మెడికల్ ఆఫీసర్ స్రవంతి, అంగన్ వాడీ టీచర్లు ఉమ, మల్లమ్మ, నిర్మల, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.


నందిగామ: గర్భిణులు, బాలింతలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ షభానా

పోషకాహారంతోనే..

షాద్‌నగర్: పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా బుధవారం మండల పరిధిలోని దూసకల్ ఆరోగ్య ఉప కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అందరి భాగస్వామ్యం ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. తద్వార శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య ఉప కేంద్రం డాక్టర్ శ్వేత, ఏఎన్‌ఎం గౌసియా, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, అమృత, ఆశవర్కర్లు యాదమ్మ, జ్యోతి, ఆయాలు పార్వతమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగనిరోధక శక్తి

కేశంపేట: పోషకాలు ఉన్న ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా జీవించవచ్చని ఐసీడీఎస్ కేశంపేట సెక్టార్ సూపర్‌వైజర్ దివ్యసింగ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్యసింగ్‌తో పాటు శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్‌లోని జీమ్స్ ఆసుపత్రి డాక్టర్లు పూనమ్ సుతార్, దివ్యలు పాల్గొన్నారు. పుట్టిన బిడ్డలకు తల్లిపాలు తాగించాలని, దీంతో శిశువులో రోగనిరోధక శక్తి పెరుగుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి విద్యావతి, అంగన్‌వాడీ టీచర్లు, జీమ్స్ ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


షాద్‌నగర్: పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు

ఉపాధి సరే.. వేతనం ఏది?

- మూణ్నెళ్లుగా అందని డబ్బులు
- ఇబ్బందుల్లో ఉద్యోగులు, కూలీలు

మంచాల: పేద ప్రజలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ఉపాధి కల్పిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు.. వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయి. పని కల్పించినప్పటికీ.. గడిచిన మూడు నెలలుగా వేతనం చెల్లించపోవడంతో కూలీలు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు.

మండలంలో 1,220 మంది కూలీలు

మంచాల మండలం పూర్తిగా కరువు ప్రాంతం. గుట్టలతో కూడిన పోడు భూములు ఉన్నాయి. ఇక్కడ పెద్దగా నీటిపారుదల ప్రాజెక్టులు, కాల్వలు లేవు. చిన్నచిన్న కమతాలు, వర్షాధార పంటలు మాత్రమే పండిస్తారు. నూటికి 80 శాతం ప్రజలు ‘ఉపాధి’ పథకం కింద పనులు చేసుకొని జీవిస్తున్నారు. మండల పరిధి 23 గ్రామాల్లో 1,220 మందికి పైగా కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. వేసవిలో ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు మాత్రమే పని చేయాలి. పని చేసే చోట టెంట్లు ఏర్పాటు చేయాలి. తాగు నీటి వసతి కల్పించాలి. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలి. ఇవేమీ ఎక్కడ ఇవ్వడం లేదు. గతంలో కూలీలకు 5 కిలో మీటర్ల దూరం వెళ్లి పని చేస్తే, రవాణా ఖర్చులు, గడ్డపారలు, మట్టి ఎత్తడానికి తట్టలు, తాగు నీటికి అదనంగా రూ.5 చెల్లించే వారు. పని చేసే చోట టెంట్లు ఏర్పాటు చేసేవారు. కానీ నేడు అవేవి లేవు.

చేసేవారికి.. చేయించే వారికి..

గడిచిన మూడు నెలలుగా కూలీలు, ఏపీఓలకు వేతనాలు రావడం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇవ్వటం లేదు. 1220 మంది కూలీలకు రూ.10లక్షల 80వేలకు పైగా, అదే విధంగా 17 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.2 లక్షలకు పైగా రావాల్సి ఉంది. పని చేసే వారికి, చేయించే వారికి జీతాలు రాకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితని వాపోతున్నారు. పని చేసే చోట ఫోన్ సిగ్నల్ లేక, సర్వర్ మొరాయింపుతో కొన్ని సార్లు హాజరు కావడం లేదని కూలీలు పేర్కొంటున్నారు.


యాచారం: మాట్లాడుతున్న అంజయ్య

పని చేసి పస్తులు..

యాచారం: కూలీ డబ్బులు అందక ఉపాధి కూలీలు పస్తులు ఉంటున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య ఆవేదన వ్యక్తంచేశారు. మండల పరిధి తమ్మలోనిగూడ గ్రామంలో బుధవారం ఆయన ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడగా.. కూలీ డబ్బులు రావడం లేదని, పని చేసి పస్తులుండాల్సిన పరిస్థితి వచ్చిందని ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం అంజయ్య మాట్లాడుతూ.. ఐదు వారాలుగా కూలీలకు డబ్బులు రావడం లేదని తెలిపారు. వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు మెస్సేజ్‌లు వస్తున్నాయని, కాని బ్యాంకుల్లో డబ్బులు ఉండడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వారం, వారం డబ్బులు అందజేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.